# ఐఏఎస్ చిన్ననాటి లక్ష్యం



**"50 నుంచి 100 లోపు ర్యాంకు వస్తుందనుకున్నా.. కానీ ఒకటో ర్యాంకు వచ్చింది. సంకల్పం ఉంటే దేనినైనా అలవోకగా సాధించొచ్చు అంటున్నారు... ఐఏఎస్ ఫస్ట్ ర్యాంకర్, చెన్నైకి చెందిన దివ్యదర్శిని"**

**ప్ర: సివిల్స్ లక్ష్యంగా ఎప్పుడు నిర్ణయించుకున్నారు? దీన్ని ఎంచుకోవడానికి ప్రత్యేక కారణాలున్నాయా..?**

**జ:** చిన్నప్పటి నుంచి ఐఏఎస్ కావాలనే లక్ష్యం ఏర్పరచుకున్నాను. ఐదో తరగతిలో ఉన్నప్పుడే బాగా చదవాలి. ఉన్నతోద్యోగంలో స్థిరపడాలని మా అమ్మానాన్నలు పదే పదే చెప్పేవారు. అప్పుడు పెద్ద చదువు అంటే ఏమిటంటూ ఓ రోజు అమ్మని అడిగా... అప్పుడు మా అమ్మ ఐఏఎస్ అంటూ కలెక్టర్ అని చెప్పింది. ఆరోజే నేను కూడా ఐఏఎస్ చదువుతా అని చెప్పాను. అప్పటి నుంచి చదువుపైనే దృష్టి పెట్టాను.

**ప్ర: ప్రిపరేషన్ ఎప్పుడు మొదలుపెట్టారు? ప్రణాళిక ఎలా తయారు చేసుకున్నారు? ఎన్ని గంటలు చదివేవారు?**

**జ:** డిగ్రీ (లా) మొదటి సంవత్సరం నుంచే సివిల్స్ ప్రిపరేషన్ కోసం రోజుకు ఐదు గంటల సమయం కేటాయించాను.

**ప్ర: మీ విజయం వెనుక శ్రమ, ప్రోత్సహించిన వాళ్ల గురించి...?**

**జ:** మాది సాధారణ కుటుంబమైనప్పటికీ లక్ష్యాన్ని ఛేదించడం కోసం నా కుటుంబం ఎంతో ప్రోత్సాహాన్ని అందించింది. రోజుకు ఐదారు గంటలు చదువుపై దృష్టి సారించడం వల్ల అనేక సమయాల్లో బాగా నీరసించి పోయేదాన్ని. అప్పుడు కుటుంబ సభ్యుల ప్రోద్బలం నా శ్రమను మర్చిపోయేలా చేశాయి.

**ప్ర: ఎన్నో ప్రయత్నంలో సివిల్స్ సాధించారు..?**

**జ:** రెండో ప్రయత్నం. మొదటి ప్రయత్నంలో ప్రిలిమ్స్‌కు కూడా ఎంపిక కాలేదు. లా ఆఖరు సంవత్సరం చదువుతున్నప్పుడే మొదటి ప్రయత్నం చేశాను.

**ప్ర: మీ ఆప్షనల్స్, వాటినే తీసుకోవడానికి కారణం?**

**జ:** పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లా. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు మంచి మెటీరియల్ లభిస్తుంది. ఈ సబ్జెక్టులో గైడెన్స్ కూడా బాగా లభించింది. లా నేను చదివిన సబ్జెక్టు. ఈ కారణాలతో వీటిని ఎంపిక చేసుకున్నాను.

**ప్ర: మీరు చదివిన ప్రామాణిక పుస్తకాల వివరాలు...? మీకు సహకరించిన ఇన్‌స్టిట్యూట్?**

**జ:** నాకు బాగా సహకారం అందించింది మాత్రం చెన్నైలోని ప్రభాకరన్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోసం లక్ష్మీకాంత్, మహేశ్వరి రాసిన పుస్తకాలు, పాత ప్రశ్నపత్రాలు, ఇండియన్ ఇన్‌స్టి

ట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ జర్నల్స్ చదివాను. లాలో జైన్ నారాయణ్‌పాండే, ఎంపీజైన్ రాసిన కాన్‌స్టిట్యూషన్; అవతార్ సింగ్ రాసిన కాంట్రాక్ట్స్, అచ్యుతన్‌పిళ్లై టోర్ట్స్, కపూర్ అండ్ అగర్వాల్ ఇంటర్నేషనల్ లా పుస్తకాలు చదివాను.

**ప్ర: ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలు?**

**జ:** ఆర్‌టీఐ యాక్ట్, లోక్‌పాల్ బిల్లుపై ప్రశ్నల వర్షం కురిపించారు. ముందుగానే దీనికోసం సిద్ధమవ్వడంతో సమాధానాలు సులువుగానే చెప్పాను. ఒకట్రెండు ప్రశ్నలకు సమాధానాలు తెలీకపోవడంతో నాకు తెలీదని నిజాయితీగా చెప్పాను.

**ప్ర: కోచింగ్ అవసరమా? ఎంతవరకు ఉపయోగపడుతుంది?**

**జ:** కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు చాలా తక్కువగా గైడ్ చేస్తాయి. అభ్యర్థులే బాగా శ్రమించాలి. మాక్ పరీక్షలు బాగా రాయాలి. కోచింగ్ సంస్థ ఎంపికలో జాగ్రత్త వహించాలి. మంచి సంస్థ ఎంపిక చేసుకోపోతే విలువైన సమయం, డబ్బు రెండూ వృథా.

**ప్ర: సివిల్స్ లక్ష్యంగా ఎంచుకున్న అభ్యర్థులకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలు..? సగటు విద్యార్థి సివిల్స్ సాధించగలడా..?**

**జ:** సివిల్స్ చదవాలంటే స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. ఓటమికి కుంగిపోకుండా ముందుకు సాగితే ఎంతటి విజయాన్నైనా సాధించొచ్చు. అదే సమయంలో సామాజిక విషయాలపై అవగాహన ఉంటే సగటు విద్యార్థి కూడా సివిల్స్ సాధించొచ్చు. ఇంటర్ నుంచే ప్రణాళిక రూపొందించుకొని ఐదారేళ్లు శ్రద్ధగా చదివితే సివిల్స్ సాధించొచ్చు. మీపై మీకు నమ్మకం, ధైర్యం, సరైన శ్రమ ఉంటే విజయం వరిస్తుంది.

**ప్ర: సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు మీ సలహా?**

**జ:** సంకల్పం ఉంటే సాధించ లేనిది ఏదీ ఉండదు. ఓటమికి నిరాశ చెందకుండా ఎదురీదాలి. ఆత్మవిశ్వాసం కోల్పోకూడదు.

**ప్ర: చదువులో మొదటి నుంచే టాపరా?**

**జ:** చిన్నప్పటి నుంచి మంచి ఉత్తీర్ణతే సాధించా. టెన్త్ (సీబీఎస్‌ఈ)లో 74 శాతం, ప్లస్ టూ(ఇంటర్)లో 86 శాతం సాధించా.

**ప్ర: సివిల్స్‌కు ఎంపిక కాకుంటే?**

**జ:** సివిల్స్‌కు ఎంపిక కాకుంటే, నాకు న్యాయశాస్త్రం(లా) ఉంది. సివిల్స్‌లో విజయం సాధిస్తాననే నమ్మకం ఉండేది.

**ప్ర: మీ ఆశయాలు, భవిష్యత్తు ప్రణాళిక..?**

**జ:** దేశం మొత్తం సమాన అభివృద్ధి సాధన, అవినీతిని అంతమొందించడం. ఈ రెండూ నా లక్ష్యాలు.

**ప్ర: మీ హాబీ లేంటి..?**

**జ:** క్రికెట్ అంటే చాలా ఇష్టం. వాలీబాల్ ఆడుతాను. సినిమాలు చూస్తుంటాను. సంగీతం కూడా వింటా.

ప్ర: బాల్యం, స్కూల్, కాలేజీ, యూనివర్సిటీ గురించి....?

జ: బాల్యం అంతా చెన్నైలోనే. ప్లస్ టూ వరకు చెన్నైలోని అసన్ మెట్రిక్యులేషన్‌లో, బిఎ బిఎల్ అంబేద్కర్ లా యూనివర్సిటీలో గడిచింది.

ప్ర: మీకు నచ్చిన పుస్తకం..?

జ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం రాసిన 'ది వింగ్స్ ఆఫ్ ఫైర్'. అంటే చాలా ఇష్టం. మన లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవచ్చో అందులో యువతకు కలాం సూచించారు.

ప్ర: మీ రోల్ మోడల్...?.

జ: అబ్దుల్ కలాం, మదర్ థెరిస్సా, మా అమ్మా నాన్నలు.

ప్ర: మీరు ఆరాధించే వ్యక్తులు...?

జ: లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ అంటే చాలా ఇష్టం. నాలాంటి వారికి ఆయన ఓ స్ఫూర్తి.

## ఆప్షనల్, జీఎస్, ఎస్సే పరీక్షలకు మీ స్ట్రాటజీ?

ఆప్షనల్‌కు సంబంధించి మొత్తం సిలబస్ పూర్తి చేశాను. ప్రతి టాపిక్ నుంచి అన్ని పాయింట్లపైనా దృష్టి సారించాను. పరీక్షల ముందు రివిజన్ చేసుకునేదాణ్ని. రాసుకున్న నోట్సు పరీక్ష సమయంలో బాగా ఉపయోగపడింది. జీఎస్ విషయంలో ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌కు అదనంగా సొంత ఆలోచన, విశ్లేషణ జోడించాను. ఎస్సే పేపర్‌కు ప్రత్యేక ప్రిపరేషన్ అవసరం లేదు. జనరల్ స్టడీస్ బాగా చదివితే ఎస్సే సులువుగా రాయొచ్చు. వార్తాపత్రికలు రెగ్యులర్‌గా చదివితే ఎస్సే బాగా రాయడానికి మంచి ఆలోచనలొస్తాయి.